ఈనాడు పల్నాడు

మంగళవారం అక్టోబరు 1, 2024

మహాత్ముడికి ఆలయం


నిర్మించిన గుడి.. అందులో గాంధీ విగ్రహం

నరసరావుపేటలో జాతిపిత మహాత్మాగాంధీకి గుడి నిర్మిస్తున్నారు. గాంధీ జయంతి అయిన అక్టోబరు 2న దీన్ని ప్రారంభించనున్నారు. నరసరావుపేట ప్రకాశ్‌నగర్‌లో రైల్వేస్టేషన్‌కు సమీపంలో మహాత్మా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదమ్ములైన శ్రీపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి దీని నిర్మిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా చిట్యాలలో నాలుగు ఎకరాల్లో నిర్మించిన గాంధీగుడిని కూడా వీరిదే కావడం గమనార్హం. ప్రస్తుతం నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయి. విగ్రహానికి ఇంకా తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. శిలను ఆళ్లగడ్డ నుంచి తెప్పించామని, దుర్గిలో విగ్రహం తయారు చేయించినట్లు వారు చెప్పారు. మన రాష్ట్రంలో తెనాలిలో గాంధీ గుడి ఉందని, తర్వాత ఇదేనని నిర్వాహకులు పేర్కొన్నారు. –ఈనాడు డిజిటల్, నరసరావుపేట

45,264 మిర్చి బస్తాల విక్రయం

గుంటూరు, న్యూస్‌టుడే: మిర్చియార్డులో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. రైతులు సోమవారం 52,124 బస్తాలు యార్డుకు తరలించారు. అందులో 45,264 బస్తాల విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 27,326 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 8,500-17,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 9,000-18,600, తాలు మిర్చికి రూ. 5,000-11,000, ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 9,000-16,000, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 9,500-18,500, తాలు మిర్చికి రూ. 5,200-10,500 ధర లభించింది.


ఎరువులు అధిక ధరకు అమ్మితే చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ డీలర్లను హెచ్చరించారు. 'ఈనాడు'లో వరి సాగుకు అందని డీఏపీ శీర్షికన ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ స్పందించింది. ఏడీఏ, ఏవో నరేంద్రబాబు పట్టణం, రూరల్ పరిధిలోని ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువుల నిల్వలు స్టాక్ బోర్డులో నమోదు చేయాలని సూచించారు. నరసరావుపేట డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 11 వేల ఎకరాల్లో నాట్లు వేశారని, అక్టోబరు 15 నాటికి మరో 3 వేల ఎకరాల్లో వరిసాగు అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ పంటలకు 1500 మెట్రిక్ టన్నుల యూరియా, 750 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 300 మెట్రిక్ టన్నుల పొటాష్ అవసరమని అంచనా వేసినట్లు వివరించారు. ఇప్పటివరకు రైతుసేవా కేంద్రాల ద్వారా 220 మెట్రిక్ టన్నుల డీఏపీ రైతులకు పంపిణీ చేశామని, 250 మెట్రిక్ టన్నుల డీఏపీ కావాలని ప్రతిపాదన పెట్టినట్లు చెప్పారు. సుమారు 500 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు ఇచ్చినట్లు వివరించారు. రెండు రోజుల్లో పీపీఎల్ డీఏపీ వ్యాగన్ వస్తుందని ఏడీఏ మస్తానమ్మ చెప్పారు.


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు

అన్న క్యాంటీన్లకు రూ.5 లక్షల విరాళం



జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ వరప్రసాద్(బుజ్జి), ఆయన మిత్రమండలి అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ. 5 లక్షల విరాళం అందించారు. సోమవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేశారు.

- పెదకూరపాడు, న్యూస్‌టుడే

దాచుకుంటే.. దోచేస్తున్నారు

ఈనాడు డిజిటల్–నరసరావుపేట, న్యూస్‌టుడే–మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు కూలీ నాలీ చేసుకొని సంపాదించిన సొమ్ములో ఎంతోకొంత దాచుకుంటే ఆపద వచ్చినప్పుడు అక్కరకు వస్తాయని తపాలా కార్యాలయంలో జమ చేస్తున్నారు. పోస్ట్‌మ్యాన్‌ను నమ్మి డబ్బులు చేతికిస్తున్నారు. ఇచ్చిన కాగితాలే నిజమైన పత్రాలని నమ్మారు. పోస్టాఫీస్‌లో జమ చేసిన సొమ్ము లేదని తెలిసి లబోదిబోమంటున్నారు. జిల్లాలో వరుస సంఘటనలు ఇటీవల చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ సంస్థ అని నమ్మకంతో రూపాయి రూపాయి కూడబెట్టి పోస్టాఫీసులో దాచుకుందామని వస్తే కొందరు సిబ్బంది డబ్బులు ఖాతాలో వేయకుండా దిగమింగుతున్నారు. ప్రజల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని రూ. లక్షలు కొల్లగొడుతున్నారు. జిల్లాలో పోస్టాఫీసు ఖాతాదారులను కొందరు ఏజెంట్లు, మరికొందరు సిబ్బందితో కలిసి ఖాతాలో జమ చేస్తున్నామని చెప్పి మోసం చేస్తున్న ఘటనలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. ఎలాంటి ఆసరా లేనివాళ్లు, ఒంటరి వాళ్లు, వృద్ధులు, వితంతువులను పోస్టాఫీసు సిబ్బంది ముంచుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ మెరుగైతే ఇలాంటి అక్రమాలు అడ్డుకట్ట వేయవచ్చు.

సొమ్ములు కొల్లగొడుతున్నారిలా..

పోస్టాఫీసు పథకాల్లో చేరితే చాలా ప్రయోజనాలు ఉన్నాయంటూ కొంత మంది గ్రామాలకు వెళ్లి ఖాతాలు తెరిపిస్తున్నారు. ఖాతా ప్రారంభించాక ఒక ట్రెండు నెలలు బాగానే సొమ్మును జమ చేస్తున్నారు. ఆ తర్వాత నుంచి నాటకం ప్రారంభిస్తున్నారు. సొమ్మును జమ చేస్తున్నట్లు నమ్మించి స్వాహా చేస్తున్నారు. పుస్తకంలో నకిలీ ముద్రలు వేస్తున్నారు. ఖాతాదారులు పోస్టాఫీసు వరకు వెళ్లకపోవడంతో ఏజెంట్లు, కొందరు పోస్టుమ్యాన్లు ఆడిందే ఆటగా డబ్బును దోచుకుంటున్నారు. కొందరైతే నకిలీ పత్రాలు, స్టాంపులు పుట్టించి నగదు జమ చేసినప్పుడల్లా నకిలీ పత్రాలు అందిస్తున్నారు.



జిల్లాలో తపాలా కార్యాలయాల్లో వరుస మోసాలపై ఆందోళన

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కొందరు సిబ్బంది బరితెగింపు

❖ దుర్గి మండలం పోలేపల్లి తపాలా కార్యాలయంలో సుమారు రూ.కోటి నగదుతో ఉడాయించాడు పోస్టుమాస్టర్ మహేష్. రెక్కల కష్టంతో పైసాపైసా పోగేసుకున్నామని, తమకు న్యాయం చేయాలని బాధితులు నరసరావుపేట డివిజన్ సూపరింటెండెంట్ వెంకటస్వామి వద్ద గోడు వెళ్లబోసుకున్నారు.

❖ తాజాగా నాదెండ్ల మండలం కనపర్రు పోస్టాఫీసులో రూ. 8 లక్షల మోసం వెలుగు చూసింది. ఖాతాదారుల నుంచి వారి ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు కొన్నేళ్లుగా నటిస్తూ మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఇదే కాకుండా గత ఐదేళ్లలో క్రోసూరు, అచ్చంపేట, పిడుగురాళ్ల మండలాల్లో కూడా ఇలాంటి మోసాలు వెలుగు చూశాయి.


నరసరావుపేట పోస్టాఫీసు వద్ద ఆందోళన చేస్తున్న దుర్గి మండల వాసులు(పాతచిత్రం)

ఖాతాదారులు మేల్కోవాలి..

❖ పోస్టాఫీసు కేంద్ర ప్రభుత్వ సంస్థ కావడం వల్ల ఎటువంటి భయం అక్కర్లేదు. ఎటొచ్చి ఏజెంట్లు, కొందరు సిబ్బందితోనే సమస్యలు ఎదురవుతున్నాయి. మనం తీసుకునే జాగ్రత్తలతో ఇలాంటి మోసాల నుంచి తప్పించుకోవచ్చు.

❖ పోస్టాఫీసుకు వెళ్లగానే కొందరు ఏజెంట్లు ఉంటారు. ఖాతా ప్రారంభిస్తాం.. అని చెబుతారు. వారిని ఆశ్రయించకుండా సొంతంగా మనమే పొదుపు ఖాతాలు, కానీ, ఇతర ఖాతాలు కానీ స్వయంగా రాసి ప్రారంభించుకోవచ్చు.

❖ ఒకవేళ ఏజెంట్లు లేదా పోస్టుమ్యాన్ ద్వారా ఖాతా ప్రారంభిస్తే.. అతని ద్వారానే మన సొమ్మును జమ చేస్తుంటే.. ఎప్పటికప్పుడు ఆ సొమ్ము మన ఖాతాలో జమ అవుతుందా? లేదా? అని మనమే స్వయంగా తెలుసుకోవాలి. ఎప్పటికప్పుడు ఈ పని చేయడం వల్ల మన సొమ్ము భద్రంగా ఉందో లేదో సులభంగా తెలుసుకోవచ్చు.

❖ మన ఖాతా పుస్తకంలో నగదు జమ వివరాలు ఎప్పటికప్పుడు ముద్రించుకోవాలి. అంటే మనం సొమ్ము ఆ నెలలో జమ అయ్యిందా? లేదా? అనేది తెలుస్తుంది. ఈ పనిని కూడా మనమే దగ్గరుండి చేసుకోవాలి. వేరే వారిపై ఆధారపడొద్దు.

రైతేరాజు

డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

పశువ్యాధులను సమర్థంగా ఎదుర్కొందాం 6లో

రూ.20 కోట్లతో మరో క్యాన్సర్ వార్డు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి నాట్కో క్యాన్సర్ కేంద్రానికి అనుబంధంగా రూ.20 కోట్ల వ్యయంతో అదనంగా మరో వార్డును నిర్మించేందుకు నాట్కో ట్రస్టు ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ కొనియాడారు. నూతన వార్డు నిర్మాణానికి వీలుగా అక్కడున్న పురాతన భవనాన్ని తొలగించే పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు క్యాన్సర్ చికిత్సకు గుంటూరు వస్తున్నందున పడకలు సరిపోవడంలేదన్నారు. ఈ సమస్యను గుర్తించిన నాట్కో ఫార్మా సీఎండీ వీసీ నన్నపనేని, ఉపాధ్యక్షుడు సదాశివరావు స్పందించి మరో 150 పడకలతో వార్డును నిర్మించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. సెల్లార్‌తోపాటు నాలుగు అంతస్తుల భవనం ఇక్కడ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఏడాది గడువులో ఈ పనులు పూర్తి కావచ్చన్నారు. పాత భవనం తొలగింపు పనులు పూర్తయిన వెంటనే కొత్త వార్డు పనులకు భూమి పూజ చేయనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం లెవల్-2 క్యాన్సర్ సెంటర్‌గా గుర్తింపు పొందిన ఈ కేంద్రం త్వరలోనే లెవల్-1 స్థాయికి చేరనుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగం అధిపతి శివరామకృష్ణ, నాట్కో క్యాన్సర్ కేంద్రం సమన్వయకర్త అశోక్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

ఇసుకకు డిమాండ్

➺ వారం రోజులకు ఒకసారి స్లాట్

➺ గంటల వ్యవధిలోనే పూర్తవుతున్న బుకింగ్

ఈనాడు–నరసరావుపేట

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో భాగంగా అవసరమైనవారు సంబంధిత పత్రాలు జత చేసి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే ఇసుకకు డిమాండ్ ఎక్కువగా ఉండటం, ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క డంపింగ్ యార్డులో మాత్రమే నిల్వలు ఉండటంతో బుకింగ్ తెరిచిన గంటల వ్యవధిలోనే అయిపోతోంది. ఇసుకకు డిమాండ్ గుర్తించిన ప్రభుత్వం వారం రోజులకు ఒకసారి ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు అవకాశం ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు ఇసుక బుకింగ్‌కు స్లాట్ తెరిచారు. సోమవారం ఉదయానికి వారం రోజులకు కేటాయించిన పరిమాణం బుకింగ్ పూర్తయింది. స్లాట్ తెరిచారన్న సమాచారం తెలుసుకుని బుకింగ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తే అప్పటికే స్లాట్ ముగియడంతో వినియోగదారులు నిరాశకు గురయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిల్వ కేంద్రాల్లో ఉన్న ఇసుక ఇప్పటికే వినియోగదారులకు సరఫరా చేశారు. ఒక్క తాళ్లాయపాలెంలో మాత్రమే నిల్వలు ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో స్లాట్ తెరిచిన వెంటనే బుకింగ్ పూర్తవుతోందని భూగర్భగనులశాఖ అధికారులు చెబుతున్నారు.

వరదలతో నిలిచిన తవ్వకాలు

భారీ వర్షాలతో సెప్టెంబరు తొలి వారంలో నిర్మాణాలు నిలిచిపోయాయి. కృష్ణా నదికి వరదలు రావడంతో ఇసుక రవాణాకు అడ్డంకులు ఏర్పడి కొన్నాళ్లు బుకింగ్ నిలిపివేశారు. వరదలకు ముందు బుక్ చేసుకున్న వారికి వరదలు ఆగిన తర్వాత రహదారి మరమ్మతు చేసి సరఫరా చేశారు. దీనికితోడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిల్వ కేంద్రాల్లో నిల్వలు నిండుకున్నాయి. ఒక్క తాళ్లాయపాలెంలో మాత్రమే నిల్వలు ఉండటంతో అందరూ అక్కడి నుంచి తెచ్చుకోవాల్సి వచ్చింది. దీంతో లభ్యత లేక ఇసుకకు డిమాండ్ పెరిగింది. మరోవైపు నదికి వరదలు రావడం, ఓపెన్ రీచ్‌లకు ఇంకా అనుమతులు రాకపోవడంతో ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. వీటిన్నింటి దృష్ట్యా ఇసుక బుకింగ్ ప్రారంభమైన వెంటనే అందరూ ఒకేసారి బుక్ చేసుకోవడానికి ప్రయత్నించడంతో గంటల వ్యవధిలోనే బుకింగ్‌లు పూర్తవుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత బుకింగ్ మొదలుకాగా తెల్లవారుజాము సమయానికి బుకింగ్ పూర్తయింది. మొత్తం 550 మంది వినియోగదారులు 12500 టన్నుల ఇసుక బుక్ చేసుకున్నారు. వీరందరికీ అక్టోబరు 5వతేదీ వరకు సరఫరా చేస్తారు. ఇది పూర్తయ్యాక నిల్వ కేంద్రంలో ఉన్న ఇసుక పరిమాణాన్ని అనుసరించి మళ్లీ వారం రోజులకు బుకింగ్‌కు అనుమతిస్తారు. అర్ధరాత్రి ఆన్‌లైన్‌లో స్లాట్ ఇవ్వడం వల్ల తాము చేసుకోలేకపోతున్నామని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ఈ విషయమై గుంటూరు జిల్లా సంయుక్త పాలనాధికారి భార్గవతేజ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా రాష్ట్రవ్యాప్తంగా ఇసుక విధానంలో భాగంగా అర్ధరాత్రి తర్వాత బుకింగ్‌కు అనుమతిస్తున్నామన్నారు. ఇక నుంచి మధ్యాహ్నం 12 గంటలకు స్లాట్ తెరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక డంపింగ్ యార్డులోనే ఇసుక నిల్వలు ఉన్నందున డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. అక్టోబరు 15 నుంచి జిల్లాలో మరో నాలుగు రీచ్‌లకు అనుమతి వచ్చే అవకాశం ఉందన్నారు. అవి అందుబాటులోకి వస్తే ఇసుక డిమాండ్ మేరకు సరఫరా చేస్తామన్నారు.




బాలుర విజేత వైజాగ్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన

ముగిసిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

■ బాలుర విజేత వైజాగ్ జట్టు

■ బాలికల విజేత కడప జట్టు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : వినుకొండ లయోలా పాఠశాలలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అండర్- 17 స్కూల్ గేమ్స్ బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలు నువ్వా నేనా అనే రీతిలో సాగాయి. శని, ఆదివారాల్లో మొత్తం 13 జిల్లాల నుంచి 26 బాల, బాలికల జట్లకు పోటీలు నిర్వహించారు. సోమవారం క్వార్టర్ ఫైనల్స్‌లో బాలుర విభాగంలో చిత్తూరుపై వైజాగ్ గెలుపొందింది. కడపపై గుంటూరు, ప్రకాశంపై తూర్పు గోదావరి, కృష్ణాపై అనంతపురం జట్లు విజయం సాధించాయి. సెమీ ఫైనల్స్‌లో గుంటూరుపై వైజాగ్, తూర్పు గోదావరిపై అనంతపురం గెలిచి ఫైనల్స్‌కు చేరాయి. ఈ పోటీల్లో వైజాగ్ విజేతగా నిలిచింది. అనంతపురం ద్వితీయ స్థానంలో నిలవగా గుంటూరు మూడో స్థానంలో నిలిచింది.

❖ బాలికల విభాగంలో కర్నూలుపై కడప, కృష్ణాపై చిత్తూరు, వైజాగ్‌పై అనంతపురం, పశ్చిమ గోదావరిపై గుంటూరు జట్లు గెలుపొందాయి. సెమీ ఫైనల్స్‌లో చిత్తూరుపై కడప, గుంటూరుపై అనంతపురం గెలిచాయి. ఫైనల్లో అనంతపురంపై కడప విజయం సాధించి విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో అనంతపురం, చిత్తూరు తృతీయ స్థానంలో ఉన్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. బాలుర విభాగంలో బెస్ట్ ప్లేయర్‌గా అలీ (గుంటూరు), బెస్ట్ స్కోరర్‌గా భరత్ సాయి (వైజాగ్), బెస్ట్ గోల్ కీపర్‌గా విష్ణువర్ధన్ (చిత్తూరు) ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఉత్తమ క్రీడాకారిణిగా వర్ష (అనంతపురం), ఉత్తమ స్కోరర్‌గా మహీ (గుంటూరు), ఉత్తమ గోల్ కీపర్‌గా భువన (కడప) ఎంపికయ్యారు. పీడీలు రాధాకృష్ణమూర్తి, చిరంజీవి, రాజేష్, వెంకటరత్నం, అనూరాధ, వీరాంజనేయులు, జోనానాయక్ తదితరులు సహకారం అందించారు. విజేతలకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నేత నాగశ్రీను, హెచ్ఎం రవి పాల్గొన్నారు.


బాలికల విజేత కడప జట్టుకు జ్ఞాపిక అందజేస్తూ..

సబ్‌జైలు సందర్శన


రిమాండు ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని సబ్‌జైలును సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, ప్రధాన సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్ సోమవారం సందర్శించారు. జైలు పరిసరాలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడి న్యాయ సహాయం ఏమైనా కావాలా అని ఆరా తీశారు. క్షణికావేశంలో చేసిన తప్పుల నుంచి గుణపాఠం నేర్చుకుని సత్ప్రవర్తనతో మెలగాలని రిమాండ్ ఖైదీలతో అన్నారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, న్యాయవాది కోటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

భూమాయ

■ అగ్రిమెంట్ చేసుకున్న భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదు

■ ఆ వివరాల ఆధారంగా రిజిస్ట్రేషన్

■ రాజధాని భూసమీకరణకు దరఖాస్తు



ఈనాడు – అమరావతి

ఇది 12.06 ఎకరాల వ్యవహారం. రాజధాని ప్రాంతం రాయపూడిలో నదీ పాతంలో ఉన్న ఈ భూమికి అగ్రిమెంట్ రాయించుకున్న ఓ వ్యక్తి వెబ్‌ల్యాండ్‌లో తన పేరు నమోదు చేయించడం... ఆపై రిజిస్ట్రేషన్ చేయించుకోవడం... అనంతరం రాజధాని భూసమీకరణకు దరఖాస్తు చేయడం తాజాగా వెలుగులోకి వచ్చింది. తద్వారా రూ. 30 కోట్ల మేర ప్రయోజనాలు కొట్టేసేందుకు పన్నిన వ్యూహం బట్టబయలైంది. ఈ వ్యవహారం ఇంత చురుగ్గా సాగడానికి తెర వెనుక నడిపించింది నాటి వైకాపా ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన ఓ సలహాదారుడు కావడం గమనార్హం.

రాయపూడి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 71, 72, 73, 1-ఎం, 1-12/2బీ2లో ఒక కుటుంబానికి భూమి ఉంది. ఇందులో సీలింగ్‌లో సగం పోగా మిగిలింది ముగ్గురు వారసులకు సంక్రమించింది. ఇందులో ఒక వారసుడికిచ్చిన భూమి మొత్తం సీలింగ్‌లో పోయింది. మిగిలిన ఇద్దరికిచ్చినదాంట్లో కొంత భాగం సీలింగ్‌లో పోగా మరికొంత మిగిలింది. సీలింగ్‌లో మొత్తం భూమి కోల్పోయిన వ్యక్తి మిగిలిన వారసులకు అనువంశికంగా వచ్చిన భూమికి 2019లో అగ్రిమెంట్ చేసుకున్నారు. తరువాత చక్రం తిప్పి రెవెన్యూ అధికారుల సహకారంతో వెబ్‌ల్యాండ్‌లో తన పేరుతోనే సర్వే నంబర్లు, విస్తీర్ణం రికార్డులకెక్కించి అనంతరం తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ సర్వే నంబర్లలో 12.06 ఎకరాలున్నట్టు చూపించారు. ఆ తరువాత కొంతభాగం మరో మహిళకు విక్రయించినట్టు చూపించి రిజిస్ట్రేషన్ చేయించారు. రాయపూడిలో భూమి ఉండగా.. దుగ్గిరాల కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించడం గమనార్హం. ఇదంతా 2021లో చోటుచేసుకుంది. దీని వెనక నాటి వైకాపా ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ సలహాదారుడి పాత్ర ఉండడంతో అధికారులు ఆగమేఘాల మీద వ్యవహారాలను చక్కబెట్టారు.

సమీకరణలో లేని భూముల సేకరణ ఎలా?

రాజధాని ప్రాంతంలో రైతుల నుంచి భూములను తీసుకునే క్రమంలో సీఆర్‌డీఏ 9.1 భూసమీకరణ ప్రకటన ఇచ్చింది. ఆయా గ్రామాల్లో భూసమీకరణ కింద తీసుకునే సర్వే నంబర్లు, విస్తీర్ణాన్ని విస్పష్టంగా ప్రకటించింది. దీనికి భిన్నంగా 2023లో రాయపూడి గ్రామంలోని సర్వే నంబరు 1-12/2బీ2, 1-ఎం, 71, 72, 73లో 12.16 ఎకరాలు భూసమీకరణ కింద తీసుకోవాలని 9.3 కింద సదరు వ్యక్తి దరఖాస్తు ఇచ్చారు. ఇందులో తన తరపున 4.35 ఎకరాలు, ఈయన నుంచి భూమి కొనుగోలు చేసిన మహిళ తరపున 7.71 ఎకరాలు తీసుకోవాలని కోరారు. ఈ సర్వే నంబర్లు గతంలో సీఆర్‌డీఏ ఇచ్చిన భూ సమీకరణ ప్రకటనలో లేవు. దీంతో అనుమానించిన సీఆర్‌డీఏ అధికారులు సమగ్ర నివేదిక ఇవ్వాలని గుంటూరు జిల్లా యంత్రాంగాన్ని కోరారు. రెవెన్యూ, సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదిక ఇచ్చారు. అయితే.. భూసమీకరణ కింద ఇచ్చినవారికి ఆ భూమి చెందుతుందా? లేదా? అని స్పష్టత ఇవ్వలేదు. వారికసలు ఆ భూములు ఎలా సంక్రమించాయో పూర్వాపరాలు ఆరా తీయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనిపై గుంటూరు జిల్లా యంత్రాంగం, సీఆర్‌డీఏ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న విషయమై ఉత్కంఠ కొనసాగుతోంది.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి

గుంటూరు: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరినీ ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పదవీకాలం 2025, మార్చి 29తో ముగుస్తుందని, ఈ నేపథ్యంలో ఎన్నికలకు ఓటరు జాబితా రూపకల్పనకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఓటరుగా నమోదుగా నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారన్నారు.

పండుటాకులకు ప్రేమ కరవై..

- జీవిత చరమాంకంలో వదిలేస్తున్న బిడ్డలు
- నేడు ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, సత్తెనపల్లి, న్యూస్‌టుడే

కాసిన చెట్టుకే రాళ్ల దెబ్బలు అన్నట్లు కని పెంచి పెద్ద చేసి ప్రయోజకులుగా మార్చిన అమ్మానాన్నలను జీవిత చరమాంకంలో కుమారులు, కూతుళ్లు చిన్నచూపు చూస్తున్నారు. వారు ఊరిలో ఎలాంటి కష్టాలు పడితే మనకేం? అన్నట్లు పట్టించుకోవడం లేదు.. వ్యాధులు వచ్చినా ఆసుపత్రుల్లో చూపించాలనే మానవత్వం కూడా మరిచారు. వృద్ధాప్యంలో పిల్లల ప్రేమ కరవై.. బాధను లోపలే దాచుకుని కుమిలిపోతున్న వారెందరో.. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం ప్రత్యేక కథనం.

❖ ఆ వృద్ధ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు. ముగ్గురూ పెళ్లిళ్లయ్యాక హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వృద్ధులు మాత్రం ఎకరం పొలంలో పంటలు పండిస్తూ సొంతూరులోనే కాలం వెళ్లదీశారు. అంతలో కరోనా వచ్చి వృద్ధుడు చనిపోయాడు. తర్వాత వృద్ధురాలు మాత్రమే మిగిలింది. కుమారులు, కూతురు ఎకరం పొలం కోసం పోటీ పడ్డారు. ఇల్లు, పొలం వాటాలేసుకుని తల్లిని ఆరేసి నెలలు తమ వద్ద ఉండేలా కుమారులు నిర్ణయించుకున్నారు. అయితే ఆరు నెలలయ్యాక చిన్నోడు పెద్దోడి ఇంటికి వచ్చేవాడు కాదు. దీంతో అమ్మ విషయంలో గొడవలు రేగాయి. ఇద్దరి మధ్య తాను ఎందుకు భారం అని ఎవరికీ తెలియకుండా హైదరాబాద్ నుంచి సొంతూరు వచ్చేసింది. ఉండటానికి ఇల్లు కూడా లేక బస్ షెల్టర్‌లో తలదాచుకుని ఎవరైనా ఏదైనా ఇస్తే తింటూ కాలం గడుపుతుండగా.. ఒక స్వచ్ఛంద సంస్థ వారు గమనించి ఆమెను పిడుగురాళ్లలోని వృద్ధాశ్రమంలో చేర్పించారు.

❖ వృద్ధాశ్రమంలో ఉంటున్న వారందరిదీ ఇలాంటి గాథలే. ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి కథ. అన్ని అవసరాలు తీరాక.. జీవిత చరమాంకంలో కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన వాళ్లను ఇలా దూరంగా వదిలేసి పోతున్నారు. కాలం ఎంత మారుతున్నా కొందరు మారడం లేదు. వృద్ధులు పసిపిల్లలాంటి వారేనని గమనించడం లేదు. వారిని భారంగా చూడటం వల్లే వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి. కొందరేమో ఇళ్లల్లో తమ వద్దే ఉంచుకుంటున్నా పూటకు సరైన అన్నం పెట్టకుండా మాడ్చుతున్నారు. చీదరింపులతో కాలం వెళ్లదీస్తున్నారు. కుమారులపై పోలీసులకు ఫిర్యాదు చేయడమా? అని వాళ్లు పెట్టే బాధల్ని ఆనందంగా అనుభవిస్తున్నారు. మనుషుల ప్రవర్తనలో మార్పు రానంత కాలం ఎన్ని చట్టాలున్నా ప్రయోజనం ఉండదని ఇలాంటి దీనగాథలు విన్నాక తెలుస్తుంది.



కారుణ్య వృద్ధాశ్రమంలో సహపంక్తి భోజనాలు చేస్తున్న వృద్ధులు

'కారుణ్యం' చూపుతూ..

పాటిబండ్ల(పెదకూరపాడు), న్యూస్‌టుడే: అయినవారంతా దూరమై వయోభారంతో బాధపడేవారికి ఇదో కరుణాలయం.. మానసిక దివ్యాంగులను అక్కున చేర్చుకునే మానవతా నిలయం.. ఉదయం నిద్రలేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే వరకు అభాగ్యుల ఆలనాపాలనా చూస్తూ.. అవ్వ, తాతలకు అన్నీతానై అండగా నిలుస్తున్న వృద్ధాశ్రమం.. పాటిబండ్ల గ్రామానికి చెందిన అల్లం చిన్నశౌరెడ్డి చెరుకుపల్లి విచారణ గురువుగా సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరాశ్రయులైన వారిని చేరదీసి, పట్టెడన్నం పెట్టాలన్న సదుద్దేశంతో 2019లో రూ.2 కోట్లతో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించి కారుణ్య వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 20 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నారు. స్థానికంగా మరో 30 మందికి మధ్యాహ్నం, సాయంత్రం భోజనం పెడుతున్నారు. పత్రికలతోపాటు, వివిధ పుస్తకాలతో గ్రంథాలయం, వారాంతంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆశ్రమ నిర్వహణ చూసిన రామోజీ ఫౌండేషన్ వాషింగ్ మిషన్, వంట సామగ్రి, నిత్యావసరాలు అందజేసింది. పలువురు దాతలు చేయూత అందిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమ నిర్వహణ బాధ్యతలను ఫాదర్ అల్లం చిన్నశౌరెడ్డి సోదరుడు డాక్టర్ ఇన్నారెడ్డి, శాంతికుమారి చూస్తున్నారు.

నా అనే వారు లేరు

నాది అమరావతి గ్రామం. ప్రశాంతంగా సాగుతున్న జీవితంలో అనుకోని ఆపద ఏర్పడి భర్త పాల్‌సత్యానందం ఐదేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. అండగా ఉంటారనుకున్న ఇద్దరు కుమారులకు ప్రాణాంతక వ్యాధులు చుట్టుముట్టి ఏడాది వ్యవధిలో ఇద్దరు కన్నుమూశారు. కుమార్తె జ్యోతి నన్ను ఆశ్రమానికి తీసుకొచ్చింది. ఇక్కడ కన్న తల్లిలా చుసుకుంటున్నారు. ఏ లేటు లేదు. – జొన్నకూటి మేరమ్మ

కంటికి రెప్పలా కాపాడుతూ..



మొల్లమాంబ వృద్ధాశ్రమంలో..

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సత్తెనపల్లి పట్టణంలో ఆదరణ, మొల్లమాంబ వృద్ధాశ్రమాల్ని దాతలు ఆదర్శంగా నిర్వహిస్తున్నారు. దశాబ్దానికి పైబడి ఈ రెండూ వృద్ధులకు అండగా నిలుస్తున్నాయి. ఒక్కో ఆశ్రమంలో 25 నుంచి 30 మంది వరకు వృద్ధులు ఉంటున్నారు. వారికి అవసరమైన ఆహారం, వసతి నిర్వాహకులు అందిస్తున్నారు. వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తున్నారు. ఎవరూలేని వృద్ధులు చనిపోతే వారి మతాచారాలకు అనుగుణంగా అంతిమ సంస్కారాల్ని నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో వృద్ధాశ్రమాల్ని నడుపుతున్నారు.

డ్రాగన్ సాగు.. లాభాలు బాగు

మొదటి మూడేళ్లలో రూ.10 లక్షలు మిగిలాయి..

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

వ్యవసాయంలో మార్కెట్ అవసరాలు, వినియోగదారుల అభిరుచులను అందిపుచ్చుకుంటూ సాధారణం కన్నా భిన్నమైన రకాల పంటలు సాగు చేస్తూ వినూత్న సాగుతో ముందుకెళ్తున్నాడు విఠంరాజుపల్లికి చెందిన రైతు పగడాల చిన కోటిరెడ్డి ఆరేళ్ల క్రితం ఆయనకున్న 3 ఎకరాల్లో ఉద్యాన తోటలు పెంపకం చేపట్టాలని ఆసక్తి కలిగింది. గ్రామంలో ఎక్కువ మంది కూరగాయలు పండిస్తారని తాను కొత్త పంటలు సాగుచేస్తే అధిక ఆదాయం పొందవచ్చని భావించి డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేయాలని నిర్ణయించాడు. ఒక్కొక్క మొక్క రూ.50 ఖరీదుతో తెలంగాణలోని భద్రాచలం నుంచి ఎకరానికి 1600 మొక్కలు చొప్పున మూడెకరాలకు 4800 మొక్కలు తెప్పించాడు. సేద్యం, నాటడం, కలుపు, ఇతర ఖర్చులు ఎకరాకు రూ.2.80 లక్షలు చొప్పున మూడెకరాలకు రూ.8.40 లక్షల వరకు ఖర్చులు అయ్యాయి. నాటిన ఏడాదిన్నరకు మొదటి కోతలో ఎకరాకు టన్ను దిగుబడి రాగా టన్ను రూ.1.40 లక్షల చొప్పున మూడు ఎకరాలకు రూ.4.20 లక్షల ఆదాయం వచ్చింది. రెండో ఏడాది ఎకరాకు 2 టన్నులు, మూడో ఏడు 3 టన్నులు చొప్పున దిగుబడి వచ్చింది. రెండో ఏడాది టన్ను ధర రూ.1.30 లక్షలు, మూడో ఏడు రూ.1.10 లక్షలు చొప్పున ధర లభించింది. ఈ ఏడాది మొదట్లో వాతావరణం అనుకూలించక సరైన దిగుబడి రాలేదు. ప్రస్తుతం మాత్రం పంటకు రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చింది.



డ్రాగన్ ఫ్రూట్ తోటలో రైతు చిన కోటిరెడ్డి

తొలుత అవగాహన లేక తెలుపు, ఎరుపు రంగుల కాయలు వచ్చేలా సాగు చేశాను. తెలుపు కాయలు కొనలేదు. దీంతో చెట్లను తొలగించి వాటి స్థానంలో ఎరుపు చెట్లు నాటాను. గతేడాది వరకు అన్ని ఖర్చులు పోను మూడేళ్లలో మూడెకరాలకు రూ.10 లక్షలు మిగిలాయి. నిరుడు దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో వాతావరణం అనుకూలించలేదు. గత నెల వరకు రూ.3 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. ఇప్పుడు కాపు బాగానే వచ్చింది ఆదాయం కూడా బాగానే ఉంది. చెట్ల నుంచి పిలకలు తీసి మొక్కలు తయారు చేస్తున్నాను. ఎవరికైనా నాటుకోవడానికి అవసరమైతే ఇస్తాను.

– చిన కోటిరెడ్డి

రైతేరాజు

పశువ్యాధులను సమర్థంగా ఎదుర్కొందాం

వేమూరు, న్యూస్‌టుడే : వర్షాకాలం సీజన్‌లో పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల పశు పోషకులు ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని వేమూరు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు జనార్ధనరావు తెలిపారు. వ్యాధి సోకాక వైద్య చికిత్స చేయించడం కంటే, ముందుగానే ప్రభుత్వం అందించే టీకాలు వేయించాలని సూచించారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై ఆయన తెలిపారు.



పశు సంవర్ధక శాఖ ఏడీ జనార్ధనరావు

గొంతువాపు వ్యాధి

లక్షణాలు : ఇది మూడేళ్ల లోపు దూడలకు వస్తుంది. ఇది సోకాక 103 నుంచి 104 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి వెంట చొంగ కారడం, గొంతువాపు వచ్చి, ఊపిరితిత్తులకు శ్వాస సరిగా అందదు. సకాలంలో వైద్యం అందకపోతే పశువు మృతి చెందే ప్రమాదం ఉంది.

నివారణ : యాంటిబయోటిక్స్, జ్వరం తగ్గడానికి మెలోనెక్స్, మెగ్లుడిన్ ఇంజక్షన్లు వాడాలి. ముందుగా వ్యాధి రాకుండా టీకాలు అందుబాటులో ఉన్నాయి.

గాలికుంటు సోకితే

లక్షణాలు : ఇది సోకిన పశువులకు జ్వరం వస్తుంది. నోటిలో, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. దీంతో పశువు నడక తగ్గిపోతుంది. పాడిగేదెల్లో పూర్తిగా పాలు తగ్గిపోతాయి.

నివారణ : ఈ వ్యాధి సోకిన పశువులకు యాంటీబయోటిక్స్ ఇంజక్షన్లు, బ్లోరో గ్లిజరిన్ పేస్ట్ పుండ్లపై పూయాలి. వ్యాధి సోకకుండా నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయి.

వ్యాధి పేరు : కుందేటి వెర్రి

లక్షణాలు : ఇది సోకిన పశువులకు 104 డిగ్రీల జ్వరం వస్తుంది. పాడి పశువులకు పాలు తగ్గిపోతాయి, మేత సరిగా తీసుకోవు.

నివారణ : సర్రాల్, ట్రిక్విన్ ఇంజక్షన్‌లు చేయించాలి.

మెంతికూర సాగు.. ఆదాయం మెండు

చినగంజాం, న్యూస్‌టుడే : చినగంజాం మండల పరిధిలోని ఇసుక భూముల్లో విద్యుత్తు మోటార్ల కింద మెంతి కూర సాగు ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. మండల పరిధిలోని మోటుపల్లి, శాంతినగర్, రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం, మూలగానివారిపాలెం, కొత్తపాలెం, మున్నంవారిపాలెం, శాంతినగర్ తదితర గ్రామాల్లో సాగు చేస్తున్నారు. సుమారు 200 మంది రైతులు మెంతి కూర సాగును తక్కువ కమతాల్లో చేస్తున్నారు. విత్తిన వారం రోజుల్లో మొక్కలు తొలగించి.. అమ్ముతుంటారు. మెంతి కూరను నెల్లూరు, ఒంగోలు, చీరాల, బాపట్ల, తదితర ప్రాంతాల మార్కెట్లకు పంపుతుంటారు. ఏడాది పొడవునా సాగు జరుగుతూనే ఉంటుంది. ఇక్కడ ఇసుక నేలల్లో పండే మెంతి కూరకు మంచి డిమాండ్ ఉంది.



విద్యుత్తు మోటార్ల కింద ఇసుక నేలలో పెంచిన మెంతి కూర

ఆదాయం ఇలా..

వారం వ్యవధిలో పెరిగే మెంతి కూర సాగు సెంటు విస్తీర్ణంలో పది కిలోల విత్తనాలకు రూ.950 వ్యయం చేస్తారు. కిలో రూ.95 చొప్పున పది కిలోలకు రూ.95 ఖర్చు పెడతారు. సెంటు విస్తర్ణంలో వారం రోజుల్లో వెయ్యి కట్టలు మెంతి కూర దిగుబడి వస్తుంది. స్థానికంగా కట్ట కూర రూ.2 ఉంటుంది. మార్కెట్‌లో కట్ట మెంతి కూర రూ.5 ఉంటుంది. ఒక్కో రైతు పది సెంట్ల విస్తీర్ణంలో సాగు చేయగా వంద మంది రైతులు కలిపి రెండెకరాల్లో సాగు చేస్తున్నారు. వారం రోజుల సాగు కాలానికి రెండు ఎకరాలకు కలిపి రూ.1.90 లక్షల వ్యయం అవుతుంది. రెండెకరాల్లో లక్ష మెంతు కూర కట్టలు దిగుబడి వస్తుంది. కట్ట రూ.2 వంతున రెండు ఎకరాలకు రూ.5 లక్షలు ఆదాయం వస్తుంది. దీంతో మెంతి కూర రైతులు ఏడాది పొడవునా లాభాల బాటలో పయనిస్తున్నారు.

అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభిప్రాయాలు తెలపండి


నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో అదనంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలపై అభిప్రాయాలు తెలపాలని కలెక్టర్ అరుణ్‌బాబు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో నాలుగు కేంద్రాల ఏర్పాటు, ఆరు కేంద్రాల చిరునామా మార్పునకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రతినిధులకు వివరించారు. అలాగే చిలకలూరిపేటకు సంబంధించి ఒక అదనపు కేంద్రం ఏర్పాటుతో పాటు నాలుగు కేంద్రాల చిరునామా మార్పు, భవనాల మార్పు గురించి తెలిపారు. నిబంధనల ప్రకారం 1500 ఓట్లకు పైగా ఉన్న పోలింగ్ కేంద్రానికి అదనంగా మరొకటి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదే సందర్భంగా ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు ఒకే కేంద్రంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. 3 నాటికి రాజకీయపార్టీల ప్రతినిధులు ప్రతిపాదనలపై సహేతుకమైన కారణాలతో అభిప్రాయాలు చెప్పాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవోలు మధులత, రమణాకాంత రెడ్డి, మురళీకృష్ణ, ఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, హాజరైన రాజకీయపార్టీల ప్రతినిధులు

అర్ధరాత్రి వెంటాడిన మృత్యువు

- ★ రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం
- ★ మరొకరికి తీవ్రగాయాలు



షేక్ ఉమర్ (పాతచిత్రం)

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మండల పరిధిలోని బొప్పూడి రిలయన్స్ పెట్రోల్ బంక్ ఎదురుగా సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి.. చిలకలూరిపేట పట్టణం గుర్రాలచావిడికి చెందిన షేక్ ఉమం (19) విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి స్థానికంగా ఉన్న సయ్యద్ సైమాతో కలిసి ద్విచక్ర వాహనంపై పుల్కాలు తినేందుకు బొప్పూడి గుడి వద్దకు వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి దాటాక ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వస్తున్న కారు డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోగా అదుపు తప్పి డివైడర్‌ను తగిలి ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఉమర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సయ్యద్ సైమాను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రక్షిత పథకంలో అక్రమాలపై డీపీవో విచారణ

చిరుమామిళ్ల (నాదెండ్ల), న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేత, మాజీ మంత్రి రజని ముఖ్య అనుచరుడు సింగారెడ్డి కోటిరెడ్డి రక్షిత మంచి నీటి పథకం, సురక్షిత నీటి పథకాన్ని అక్రమంగా చేజిక్కున్నారని గ్రామస్థులు తెలిపారు. నాదెండ్ల మండలం చిరుమామిళ్ల రక్షిత, సురక్షిత మంచి నీటి పథకాల్లో చోటు చేసుకున్న అవినీతిపై ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పంచాయతీ జిల్లా అధికారి ఎంవీ భాస్కరరెడ్డి సోమవారం విచారణ చేశారు. అయితే 2019లో సింగారెడ్డి కోటిరెడ్డి, ఆయన కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి వీటి తాళాలు పగులగొట్టి బలవంతంగా గృహాలను స్వాధీన పరచుకున్నారని తెలిపారు. చెరువు నుంచి రక్షిత పథకానికి నీటిని తోడే పంపులతో పంట భూములకు మళ్లించారన్నారు. అయితే ఇవన్నీ అవాస్తవమని, తనపై రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని కోటిరెడ్డి డీపీవోకి వివరణ ఇచ్చారు.

ముగిసిన యూటీఎఫ్ జిల్లా క్రీడా పోటీలు



విజేతలుగా నిలిచిన మహిళలతో ఎమ్మెల్సీ, యూటీఎఫ్ జిల్లా నేతలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక కోడెల శివప్రసాదరావు స్టేడియంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ విభాగాల్లో విజేతలకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, విజయసారథి జ్ఞాపికలు అందజేశారు. క్రికెట్ విభాగంలో విన్నర్‌గా వినుకొండ, రన్నర్‌గా గురజాల, వాలీబాల్ విభాగంలో విన్నర్‌గా గురజాల, రన్నర్‌గా నరసరావుపేట, షటిల్ సింగిల్ విభాగంలో విన్నర్‌గా ఖాదర్ మస్తాన్ (చిలకలూరిపేట), రన్నర్‌గా వెంకట్రామయ్య (నరసరావుపేట), క్యారమ్ డబుల్స్ విభాగంలో గురజాలకు చెందిన షేక్ మస్తాన్‌వలి, బి.స్వర్ణరాజు విజేతలుగా నిలిచారు.

తపాలా ఉద్యోగులపై వేటు

కనపర్రు (నాదెండ్ల) : నాదెండ్ల మండలం కనపర్రులో ఖాతాదారులు చెల్లించిన పొదుపు సొమ్మును స్వాహా చేసిన తపాలా ఉద్యోగులు ఇద్దరిపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఖాతాదారులు చెల్లించిన ఆర్డీలు, పొదుపు సొమ్ము కార్యాలయానికి జమ చేయకుండా బ్రాంచి పోస్టు మాస్టర్ (బీపీఎం) పుల్లగూర చందు, సహాయ పోస్టు మాస్టర్ సయ్యద్ సలీం బాషా సొంతానికి వాడుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో విచారించిన ఉన్నతాధికారులు వారిని విధుల నుంచి తప్పించారు. నరసరావుపేటకు చెందిన వంశీకి తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

అధికారం అడ్డు పెట్టుకుని బెదిరించాడు

కేబుల్ సంస్థను ఆక్రమించారని వైకాపా జడ్పీటీసీపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి మంత్రి విడదల రజని ముఖ్య అనుచరుడు, నాదెండ్ల జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తానరావు తన కేబుల్ సంస్థ ఆక్రమించాడని చిలకలూరిపేట సీసీ కేబుల్ సంస్థ భాగస్వామి చింతకాయల వెంకట కోటేశ్వరరావు పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయాన్ని సోమవారం ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అనంతరం పాత్రికేయులతో అతను మాట్లాడి వివరాలు తెలిపాడు. ఆ వివరాల మేరకు..

★ పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో కేబుల్ టీవీ ప్రసారాలు చేసే సీసీ కేబుల్ సంస్థను చింతకాయల వెంకట కోటేశ్వరరావు నిర్వహిస్తున్నాడు. కేబుల్ ఛానల్‌లో ప్రకటనలు, కార్యాలయ నిర్వహణ బాధ్యతలు ఇతను పర్యవేక్షిస్తున్నాడు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టింది. అప్పటి ఎమ్మెల్యే విడదల రజని ముఖ్య అనుచరుడైన నాదెండ్ల వైకాపా నేత కాట్రగడ్డ మస్తానరావు కేబుల్ సంస్థ కార్యాలయాన్ని ఆక్రమించాడు. అందులోని భాగస్వాములను బెదిరించాడు. వాటా తనకు అప్పగించాలంటూ బలవంతంచేశాడు. అందుకు ఒప్పుకోక పోవడంతో పోలీసు స్టేషన్‌లో 15రోజులపాటు కోటేశ్వరరావును అక్రమంగా నిర్బంధింపజేశారు. కోటేశ్వరరావు నిర్వహిస్తున్న డెయిరీ ఫాం మూయించివేశారు. చెక్కులు, ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయకుంటే హతమారుస్తామని హెచ్చరించి సంస్థను బలవంతంగా ఆక్రమించాడు. ఐదేళ్లలో అతనికి దక్కాల్సిన వాటా రూ.1.85కోట్లను కాట్రగడ్డ దోచుకున్నాడు. విచారించి తనకు న్యాయం చేయాలని ఏఎస్పీ సంతోష్‌కి విన్నవించినట్లు బాధితుడు పాత్రికేయుల ఎదుట వెల్లడించాడు.

మాజీ మంత్రి రజని వ్యక్తిగత సహాయకుడిపై..

వైకాపా అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే విడదల రజనితో మాట్లాడి.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోడిగుడ్ల సరఫరా బాధ్యతలు అప్పగిస్తామని తనను ప్రలోభ పెట్టారని, ఇందుకు ఆమె వ్యక్తిగత సహాయకుడు (ప్రైవేటు) మానుకొండ శ్రీకాంత్‌రెడ్డి రూ.28 లక్షలు తీసుకున్నాడని చిలకలూరిపేటకు చెందిన ఎంవీ రత్నారెడ్డి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాడు. గుత్తేదారుగా నియమించకుండా మోసానికి పాల్పడినట్లు తెలిపాడు. ఎమ్మెల్యే తర్వాత మంత్రి అయ్యారని అయినా ఐదేళ్లుగా సొమ్ము తిరిగి ఇస్తామని మభ్యపెట్టి, అధికారాన్ని అడ్డు పెట్టుకుని బెదిరించారన్నాడు. విచారించి న్యాయం చేయాలని ఏఎస్పీ సంతోష్‌కు విన్నవించాడు.

ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు ప్రజా వేదికలో అందించిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలని ఏఎస్పీ (అడ్మిన్) జేవీ సంతోష్ ఆదేశించారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఏఎస్పీ పాల్గొని వినతులు స్వీకరించారు.

మాజీ ఎమ్మెల్యే అనుచరులు మోసగించారు..

నరసరావుపేట జామియా మసీదు పునర్నిర్మాణానికి రూ.3.10 కోట్లు ఖర్చు అవుతుందని అప్పటి వైకాపా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు అంచనాలు వేయించారని, అయితే ప్రజల నుంచి చందాలు వసూలు చేశారని ముస్లిం మత పెద్దలు ఫిర్యాదు ఇచ్చారు. మసీదు స్థలంలో వాణిజ్య దుకాణాలు నిర్మిస్తామని వ్యాపారుల నుంచి రూ.56 లక్షలు వసూలు చేసి మోసగించిన షేక్ ఖాజావలి, రహంతుల్లా, సిలార్, ఆదాంపై చర్య తీసుకోవాలని కోరారు.

భూములు ఇప్పిస్తానని మోసం

గిరిజన కార్పొరేషన్ నుంచి సాగు భూములు ఉచితంగా ఇప్పిస్తానని చిలకలూరిపేట వైకాపా నేత గుంజి శ్రీనివాసరావు మోసగించాడని ఫిర్యాదు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.25 లక్షలు చొప్పున ముగ్గురి వద్ద కలిపి రూ.75 లక్షలు వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. దీన్ని అసరాగా చేసుకుని చినగంజాంకు చెందిన సుబ్బారావు పంచాయితీ పెట్టి సొమ్ము ఇప్పిస్తానని మరో రూ.21 లక్షలు తీసుకుని మోసగించినట్లు నరసరావుపేట సీబీఎన్ కాలనీకి చెందిన మల్లా సోమరాజు పేర్కొన్నాడు.

యానిమేటర్ రూ.20 లక్షలు స్వాహా

మా స్వయం సహాయక సంఘానికి ఏడాదిన్నర క్రితం రూ.22 లక్షలు రుణం మంజూరైంది.. సంఘ సభ్యులను మోసగించి యానిమేటర్ వనజా రూ.20 లక్షలు స్వాహా చేసింది.. చర్య తీసుకోవాలని యడ్లపాడు మండలం తిమ్మాపురానికి చెందిన డి.అనూష, జి.లక్ష్మీ కోరారు.

బంగారం చేయిస్తానని మోసగించాడు

నరసరావుపేట పట్టణానికి చెందిన బంగారు నగల వర్తకుడు నగలు తయారు చేయిస్తానని రూ.2 లక్షలు ముందస్తుగా తీసుకున్నాడు.. ఆరు నెలలు గడిచినా నగలు చేయించకుండా మోసగించాడు.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే రూ.లక్ష ఇచ్చాడు.. మిగతా సొమ్ము ఇవ్వలేదని జొన్నలగడ్డకు చెందిన ఉప్పుటూరి అనిల్ ఫిర్యాదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

నరసరావుపేట
•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట) : దసరా ఉత్సవాలు సమీపిస్తుండటంతో నరసరావుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లమ్మ సెంటర్ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద శరన్నవ రాత్రులు వైభవంగా నిర్వహించేందుకు మండపం ఏర్పాటు చేశారు. శంకరమఠం వద్ద విద్యుత్తు దీపాలతో ప్రభలు ఏర్పాటు చేశారు.

రొంపిచర్ల : రొంపిచర్ల శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో 3 నుంచి దేవీ శరన్నవ రాత్రులు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త మద్ది రామచంద్రరావు సోమవారం తెలిపారు. 3న బాలా త్రిపురసుందరిగా, 4న కౌమారి, 5న వైష్ణవి, 6న మహేశ్వరి, 7న మహాకాళి, 8న లక్ష్మీదేవి, 9న సరస్వతి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దని, 12న రాజరాజేశ్వరిగా అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తారని వివరించారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట సెంట్రల్ : ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని అపుస్మా రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.తులసి విష్ణుప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి కోటప్పకొండ వద్ద ఉన్న లివింగ్ హోప్ ఇంటర్నేషనల్ స్కూల్లో సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లకు గుర్తింపు ఇవ్వాలని, వృత్తిపన్ను మినహాయించాలని, విద్యాహక్కు కింద పొందిన సీట్లకు ప్రభుత్వం ఏడాది లోపు నగదు చెల్లించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీజేఎన్ ధన్, మద్దిరాల శ్రీనివాసరావు, వెంకట్రావు, ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్లు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? స్థానిక చౌత్రా సెంటర్ ఆంజనేయస్వామి గుడి సమీపంలో కొద్దిపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. **-రమేష్**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, ఏఈ**

? స్థానిక స్టేట్‌బ్యాంక్ వద్ద సర్వీసు రోడ్డులో వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **-నాగేశ్వరరావు**

✔ వాహనాలు రోడ్డు మీదకు రాకుండా చర్యలు తీసుకుంటాం. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **-రమేష్, పట్టణ సీఐ**

? పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డివైడర్‌పైన ఉన్న విద్యుద్దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **-ప్రశాంత్**

✔ విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **-శ్రీనివాసరావు, పురపాలకసంఘ ఏఈ**

? చిలకలూరిపేట ఆర్యవైశ్య కల్యాణ సమీపంలో మంచినీటిని వదిలిన సమయంలో పైపులు లీకై రోడ్డు మీదకు నీరు పాతున్నాయి. **-మల్లిబాబు**

✔ పరిశీలించి నీరు వృధా పోకుండా చర్యలు తీసుకుని మరమ్మతులు చేయిస్తాం. **-శ్రీనివాసరావు, పురపాలక సంఘ ఏఈ**

– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

పండగ వేళ ప్రత్యేక బస్సు సర్వీసులు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలు, పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో రద్దీకి తగ్గట్లుగా సర్వీసులు నడిపేందుకు ప్రజా రవాణా సంస్థ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రయాణికుల సౌకర్యార్థం దసరాకు ముందే హైదరాబాద్ నుంచి పల్నాడు జిల్లాకు 65 సర్వీసులు నడపనున్నట్లు డీపీటీవో ఎన్వీ శ్రీనివాసరావు సోమవారం పేర్కొన్నారు. కార్యచరణలో భాగంగా పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి మినహా ఐదు డిపోలైన నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల నుంచి 8 నుంచి 11 వరకు 23 సూపర్ లగ్జరీ, 26 అల్ట్రా డీలక్స్, 16 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీ ఎక్కువ ఉంటే ప్రత్యేక సర్వీసులు నడపుతామని ఆయన తెలిపారు.

గ్రామీణ సంత.. అమ్మకాలకు లేదిక చింత

వినుకొండ, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంత రైతులకు మార్కెట్ సదుపాయాల కల్పనకు నాబార్డు గ్రామీణ సంతలను ప్రోత్సహిస్తోంది. పంచాయతీలు భూమి ఇచ్చి సమకూరిస్తే అందులో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థికసాయం అందిస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నమూనా ప్రాజెక్టుగా వినుకొండ మండలం విఠంరాజుపల్లె వద్ద జాతీయ రహదారి అంచున సుమారు ఎకరంన్నర స్థలంలో రూ.20 లక్షలతో కూరగాయల క్రయ, విక్రయాలకు స్టాల్స్, మరుగుదొడ్ల వసతి, కార్యాలయం నిర్మించారు. మరో పక్షం రోజుల్లో ప్రారంభించేందుకు పనులు వేగంగా చేస్తున్నారు.

కూరగాయల క్రయ, విక్రయాలకు స్టాల్స్ ఏర్పాటు

నాబార్డు ఆర్థిక సాయంతో షెడ్ల నిర్మాణం

విఠంరాజుపల్లెలో నమూనా ప్రాజెక్టు అమలు


గ్రామీణ సంత ఏర్పాటుకు వేసిన షెడ్లు

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా..

రైతుల నుంచి వ్యాపారులు, వినియోగదారులు కొంటే ఆర్థికంగా మేలు చేకూరుతుంది. ఇందుకు గ్రామీణ సంతలకు రూపకల్పన చేశారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లెతో పాటు చుట్టుపక్కల పది గ్రామాల్లో అత్యధిక విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. సరైన మార్కెట్ వసతి లేక రోడ్డుపైకి చేర్చి అక్కడి నుంచి గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు లారీల్లో తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఈ ఇబ్బందులను అధిగమించి రైతులకు మేలు చేకూర్చేందుకు స్థానికంగా గ్రామీణ సంత ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జాతీయ రహదారి అంచున స్థలం సమకూరగా మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీ రూ.5 లక్షలు కేటాయించింది. దీనికి నాబార్డు మరో రూ.15 లక్షలు మంజూరు చేసి అమలు చేసే బాధ్యతను మైరాడా స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. మొత్తం రూ.20 లక్షలతో నేల చదును చేసి గుంతలు పూడ్చి, రిటైల్, హోల్‌సేల్‌కు వేర్వేరుగా రెండు షెడ్లు నిర్మించారు. అందులో 40 స్టాల్స్‌కు వసతి సదుపాయం కల్పించారు.

11 మందితో కమిటీ ఏర్పాటు

నాబార్డు డీడీఎంతో పాటు స్థానిక కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్, పంచాయతీ సర్పంచితో పాటు మరో ఎనిమిది మంది రైతులు ఇందులో సభ్యులుగా ఉంటారు. రైతులు నేరుగా తాము పండించిన కూరగాయలను సంతకు తెచ్చి అమ్మాలి. మార్కెట్‌కు సంబంధించిన క్రయ, విక్రయాల్లో వీరికి మైరాడా సంస్థ తోడ్పాటు ఇస్తుంది. ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రధాన వ్యాపారులను ఇక్కడకు ఆహ్వానించి సంతలో రైతుల వద్ద కొనేలా సహకరిస్తుంది. వ్యాపారులు చెల్లించే రుసుముల వల్ల పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. అవసరమైతే భవిష్యత్తులో దీనికి అనుబంధంగా శీతల గోదాం నిర్మించేందుకు ఆర్థిక సంస్థలు హామీ ఇచ్చాయి. రైతులు, వ్యాపారులకు రుణ సౌకర్యం కల్పించేందుకు సహకార బ్యాంకు అధికారులను ఇందులో సభ్యులుగా ఉన్నారు. మొత్తం మీద గ్రామీణ సంత రైతు, వ్యాపారులకు మధ్య వారధి కానుంది.

పూర్తి చేసి పంచాయతీకి అప్పగిస్తాం

పక్షం లేదా నెలలో పనులు పూర్తి చేసి షెడ్లు పంచాయతీకి అప్పగిస్తాం. నిర్వహణ బాధ్యత వారే చూస్తారు. మేం కోస్తా వ్యాపారులను కలిసి సంతకు రావాలని ఆహ్వానిస్తాం. అందరూ సహకరిస్తే మంచి ఫలితాలు వస్తాయి. రైతులకు మేలు చేకూరుతుంది.

–మంజునాథ్, మైరాడా స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త

అభివృద్ధిపై కౌన్సిలర్ల గళం


మాట్లాడుతున్న పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట పురపాలక కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్మన్ ఎస్కే రఫాని అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. తెదేపా, వైకాపాకు చెందిన పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో సమస్యలు ఏకరవు పెట్టారు. ప్రధానంగా కళామందిర్ కూడలిలోని పలు మున్సిపల్ దుకాణాలకు సంబంధించి అద్దె వసూలు చేయడం లేదని.. వసూలు చేస్తే ఆదాయం సమకూరుతుందని సూచించారు. పట్టణంలో 6 వేల వరకు అక్రమ కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, ఆక్రమణ తొలగింపు కేబీ రోడ్డు వరకే తొలగిస్తారా... అన్ని ప్రాంతాల్లో తీసివేస్తారా అని కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సంబంధించి కమిషనర్ శ్రీహరిబాబు మాట్లాడుతూ పట్టణంలో అక్రమ కుళాయి కనెక్షన్లు సర్వే చేయించి మున్సిపల్ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. ఆక్రమణలు చేసినవారు వారే తొలగించుకోవాలని, లేకుంటే అన్ని ప్రాంతాల్లో తామే తొలగిస్తామని తెలిపారు. దుకాణాలకు సంబంధించి ఇబ్బందులను తొలగించి అద్దె వసూలు చేస్తామని సమాధానమిచ్చారు. టిడ్కో ఇళ్లల్లో నీళ్లు లీకవుతున్నాయని, 11వ వార్డులో కోతుల బెడద అధికంగా ఉందని, గాంధీపేటలో పారిశుద్ధ్య సమస్య ఉందని, వీధిదీపాలు వెలగడం లేదని ఇలా పలు సమస్యలను కౌన్సిలర్లు సమస్యలను ప్రస్తావించారు. ఛైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక నిధులు తెస్తున్నారని, వీటితో అన్ని వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

2న సత్యాగ్రహ దీక్ష

నరసరావుపేట సెంట్రల్ : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశలవారిగా చేపట్టిన పోరాటంలో భాగంగా 2న మున్సిపల్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేయనున్నట్లు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నరసరావుపేట శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం దీక్షకు సంబంధించిన పత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, బాషా, సాంబయ్య, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రమాదేవి, పూర్ణచంద్రరావు, నాగయ్య, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆహారం, వసతి పరిశుభ్రంగా ఉండాల్సిందే

వినుకొండ, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాలను స్థానిక కోర్టు జడ్జి ఎం.మహతి అకస్మికంగా తనిఖీ చేశారు. నిత్యావసరాలతో పాటు నిల్వ గదులు పరిశీలించారు. నరసరావుపేట రోడ్డులోని వెనుకబడిన తరగతుల విద్యార్థుల గురుకుల పాఠశాల వంటగదిలో పరిశుభ్రత మెరుగు పరచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎన్నెస్పీ కాలనీలోని గిరిజన గురుకులం, ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి ఆహార పట్టిక అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి పఠాన్ గౌస్‌ఖాన్, పీవీ రమణారెడ్డి ప్యానల్ న్యాయవాదులు, పోలీస్, కోర్టు సిబ్బంది ఉన్నారు.


విద్యార్థుల వసతి గృహంలో నిత్యావసరాలు పరిశీలిస్తున్న జడ్జి మహతి

లారీ నుంచి జారి పడ్డ గ్రానైట్ రాళ్లు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట మండలం మురికిపూడిలో గ్రానైట్ లారీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సోమవారం పెద్ద గ్రానైట్ రాళ్లను లారీలో తరలిస్తుండగా గ్రామంలోని వడ్డెర కాలనీ వద్ద అవి జారి పడిపోయాయి. పక్కనే ఉన్న ఇంటి ముందు గాబుపై పడటంతో పెద్ద ప్రమాదం తప్పింది.


పడిపోయిన గ్రానైట్ రాళ్లు

నీటి వృథా పట్టదా..

నరసరావుపేట కోడెల శివప్రసాద్‌రావు స్టేడియంలో మంచినీటి కుళాయికి కొద్ది రోజుల క్రితం ట్యాప్ ఆపే మూత విరిగి మంచినీరు వృథాగా పోతోంది. వ్యాయామం చేయడానికి వందలాది మంది క్రీడాకారులు, ప్రజలు ఈ కుళాయి వద్దే దాహం తీర్చుకుంటారు. అధికారులు నీటి వృథా అరికట్టాలని వారు కోరుతున్నారు. **-మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే**


కుళాయి ట్యాప్ లేక వృథా అవుతున్న నీరు

ప్రయాణికులు చరవాణుల అపహరణ

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రమైన నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ముప్పాళ్ల మండలం కొంకావారిపాలేనికి చెందిన రైతు పూదోట ఆగ్నేశయ్య చరవాణి చోరీ చేశారు. సోమవారం బస్టాండ్‌లో అతను సత్తెనపల్లి బస్సు ఎక్కుతుండగా.. అతని జేబులోని చరవాణి అపహరణకు గురైంది. ప్రకాశం జిల్లా యర్రగుంటపాడు వృద్ధుడు ఒకరు బస్సు ఎక్కుతున్న సమయంలో అతని చరవాణిని కూడా దొంగలించారు.

ఆర్డీవోగా మధులత

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : నరసరావుపేట డివిజన్ ఆర్డీవోగా కె.మధులత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నరసరావుపేటకు వచ్చారు. ఇప్పటి వరకు ఆర్డీవోగా బాధ్యతలు నిర్వహించిన సరోజిని సాధారణ పరిపాలన శాఖలో రాజకీయ విభాగానికి బదిలీ అయ్యారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీవో మధులత

ఖాతాదారులకు మరిన్ని సేవలందించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : బ్యాంకు ఖాతాదారులకు మరిన్ని సేవలు అందించాలని యూనియన్ బ్యాంకు ఎండీ, సీఈవో మణిమేఖలై అన్నారు. నరసరావుపేట రీజియన్ ప్రాంతీయ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకు సేవలు మరింత విస్తరించాలన్నారు. ఇప్పటికే నరసరావుపేట రీజియన్ పరిధిలో పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 65 శాఖల ద్వారా ఆర్థిక సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామసుబ్రహ్మణ్యం, రీజనల్ హెడ్ మాధురి, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి కన్వీనర్ భాస్కరరావు పాల్గొన్నారు.


ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఈవో మణిమేఖలై

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : గుంటూరు జాగర్లమూడి చంద్రమౌళి కాలేజీ ఆఫ్ లా, ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చిలకలూరిపేటలోని నిఖిల డిగ్రీ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో పాల్గొన్న లా కళాశాల ప్రతినిధులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నూతన చట్టాలు, గృహహింస, బాలికలపై అత్యాచారాలు, సైబర్ క్రైమ్ వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిట్టినేని సుధాకర్‌బాబు, ప్రతినిధులు త్రిపురం సురేంద్రప్రసాద్, కె.పుల్లారావు, నిఖిల డిగ్రీ కళాశాల అధ్యాపకులు టి.శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ ఇన్‌ఛార్జి బొంతా భగత్‌సింగ్, ఎం.నాగేశ్వరరావు, ఎం.సాయినాయక్, గోపి, సాహిత్, విద్యార్థులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయ కళాశాల ప్రతినిధులు

అపీ ఇవీ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

యడ్లపాడు, న్యూస్‌టుడే : నరసరావుపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో మండలంలోని వంకాయలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.నాగవైష్ణవి అండర్- 17 విభాగంలో, బి.హంసిక అండర్-14లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అక్టోబరులో రెండు, నాలుగు వారాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ బి.శ్రీనివాసరావును పాఠశాల హెచ్ఎం జె.రవి, సర్పంచి వి.రాజు, ఛైర్మన్ టి.రాయుడు, పాఠశాల సిబ్బంది అభినందించారు.


విద్యార్థినులతో హెచ్ఎం రవి, పీడీ శ్రీనివాసరావు

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

వినుకొండ, న్యూస్‌టుడే : తాజా బదిలీల్లో వచ్చిన పలువురు అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం శాఖ వినుకొండ సబ్ డివిజన్ డీఈఈ గా రాచవేల్పుల నాగహరి హరకుమార్‌రాజు, ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐగా దేవర శ్రీనివాసరావు, ఎస్పీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసరావు వారిలో ఉన్నారు.

రుణ వాయిదాలు సకాలంలో చెల్లించాలి

యడ్లపాడు, న్యూస్‌టుడే : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న సంఘ సభ్యులు రుణ వాయిదాలను సకాలంలో చెల్లించి సంఘాల పురోభివృద్ధికి తోడ్పడాలని జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి (డీసీఏవో) డి.శ్రీనివాసరావు అన్నారు. యడపాడు సొసైటీ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. యడ్లపాడు సొసైటీ సభ్యులకు రూ.45 కోట్ల రుణాలు మంజూరు చేసిందని, గడువు దాటినా వసూలు కాని రుణ వాయిదాల మొత్తం రూ.5 కోట్లు ఉందన్నారు. వాయిదాలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిలకలూరిపేట జీడీసీసీ బ్యాంకు మేనేజర్ గొడ్డేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సొసైటీ సభ్యులు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పర్సన్ ఇన్‌ఛార్జి పీపీబీ మాట్లాడుతూ సొసైటీలో రూ.300 షేరుధనం కలిగిన పూర్వ సభ్యులు ఆధార్, పాన్, ఫొటో, ఫోన్ నంబరు సొసైటీలో అందజేసి ఈకేవైసీ చేయించుకుని ఓటుహక్కు పునరుద్ధరించుకోవాలని కోరారు. సొసైటీ సీఈవో జి.శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు మద్దినేని సుబ్బారావు, సభ్యులు హాజరయ్యారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక ఏపీ వైద్య విధాన పరిషత్ ఏరియా వైద్యశాలలో రక్త నిల్వ కేంద్రంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రక్త నిల్వ వైద్యాధికారి మాట్లాడుతూ రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి అనే నినాదంతో ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చని సూచించారు. అనంతరం పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రక్త నిల్వ కేంద్రం టెక్నీషియన్స్ ఎస్.అశోక్‌వర్మ, ఎస్.ప్రసాద్, లింకు వర్కర్ స్కీం ప్రాజెక్టు సిబ్బంది జోనల్ సూపరింటెండెంటు బి.నాగేశ్వరరావు, క్లస్టర్ లింక్ వర్కర్ ఎం.మెరిసి ఫ్లారెన్స్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

నరసరావుపేట వ్యవసాయం : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్య జీవితాన్ని పొందవచ్చని డీపీఎం అమలకుమారి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ బయట మార్కెట్‌లో దొరికే పదార్థాలు తిని ప్రజలు ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారని, రసాయన ఎరువులు అధికంగా వాడిన పంట ఉత్పత్తులను తీసుకుని చిన్నతనంలోనే వ్యాధుల బారిన పడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నరసరావుపేట డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకు శిక్షణ తరగతులు దోహదం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రొడక్టు డిజైనింగ్ డ్రాఫ్టింగ్‌పై మెకానికల్ విభాగం విద్యార్థులకు కార్యశాల నిర్వహించారు. ఉత్పాదక పెంపునకు సంబంధించి పలు అంశాలు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్‌బాబు, విభాగాధిపతి డాక్టర్ ఫణిసుష్మ, సమన్వయకర్త డాక్టర్ సులోచన పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట అర్బన్ : రాష్ట్రంలో ఒప్పంద కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతన విధానం అమలు చేయాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్న సందర్భంలో రక్షణ పరికరాలు ఇవ్వాలని, భద్రత చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీవో మధులతకు వినతిపత్రం అందజేశారు. సంఘ నేతలు ఉన్నారు.

అబ్కారీ శాఖ సీఐగా సోమయ్య

నరసరావుపేట టౌన్ : మద్య నిషేధం, అబ్కారీ శాఖ నరసరావుపేట సీఐగా కసుకుర్తి సోమయ్య నియమితులయ్యారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : నరసరావుపేట పాతూరుకు చెందిన సయ్యద్ రహీం (అలియాస్ మున్నాభాయ్) ఎన్నికల కౌంటింగ్ రోజు పెండ్యాల శివ అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచాడు. సోమవారం ఒకటో పట్టణ పోలీసులు ఈ కేసులో అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

గాంధీ జయంతి నిర్వహించాలి

నూజండ్ల : స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లే అన్ని పంచాయతీల్లో అందుకు గుర్తింపుగా గాంధీ జయంతి 2న నిర్వహించి స్ఫూర్తిగా నిలవాలని డీడబ్ల్యుఎస్సీ పల్నాడు జిల్లా సమన్వయకర్త రమేష్ అన్నారు. నూజండ్ల మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహణ, గాంధీ జయంతి ఉత్సవాలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిశ్రమ దాణా సరఫరా చేయాలి

వినుకొండ : పాడి రైతులకు మిశ్రమ దాణా రాయితీపై సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము కోరారు. స్థానిక పశు వైద్యశాలలో సహాయ సంచాలకురాలు సరోజనిదేవిని సోమవారం పాడి రైతులతో కలసి వినతి పత్రం అందజేశారు. బాలాజీ, లింగా రామయ్య తదితరులు ఉన్నారు.

వలస కార్మికుడి మృతి

యడ్లపాడు : మండలంలోని ఉన్నవ సాయిబాలాజీ నూలుమిల్లులో పని చేసే ఒడిశాకు చెందిన వలస కార్మికుడు అనారోగ్యంతో ఆకస్మాత్తుగా మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. అన్నంజన (27) ఆదివారం నివాస సముదాయం నుంచి బయటకు వచ్చి కుప్పకూలాడు. మిల్లు నిర్వాహకులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ గుర్తింపు

బొల్లాపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని సీతారామపురం తండాకు చెందిన వివాహిత అదృశ్యం కేసును బండ్లమోటు పోలీసులు 24 గంటల్లో పరిష్కరించారు. గ్రామానికి చెందిన బాణావత్ బద్దునాయక్ తన భార్య జ్యోతిబాయి కనిపించడం లేదని ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె ఆచూకీ కనిపెట్టి సోమవారం తహసీల్దార్ వద్ద హాజరు పర్చారు. తర్వాత ఆమె ఇష్టం మేరకు భర్తకు అప్పగించినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

అర్జీలు తక్షణమే పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు తీసుకున్న కలెక్టర్

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా ప్రజలు సమస్యలపై ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. 101 అర్జీలు అధికారులు స్వీకరించారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో వినాయకం అర్జీలు తీసుకున్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మాచర్ల మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికపై అత్యాచారం చేసిన వార్డెన్‌పై ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీసీ కులానికి చెందిన యద్దనపూడి శ్రీనివాసరావు ఎస్టీగా చట్టవిరుద్ధంగా ధ్రువపత్రం పొంది ఉద్యోగం చేస్తున్నాడని, దీనిపై అధికారులు అతనికి కొమ్ము కాస్తున్నారని చెప్పారు.

డీఎస్పీపై చర్యలు తీసుకోవాలి

చిలకలూరిపేట మండలం యద్దనపూడిలో ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తి ఇల్లు కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్న డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఎస్టీ కాలనీలో ఏడుకొండలు ఇంటికి గోవిందరాజులు పొక్లెయిన్‌తో వెళ్లి ఇల్లు కూల్చిన ఘటనలో నిందితులను డీఎస్పీ నాగేశ్వరరావు కాపాడుతున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు కూడా పోలీసులు వీలు లేదని అడ్డుకుంటున్నారని నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జనసేన ఆధ్వర్యంలో ప్రాయశ్చిత దీక్ష

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపరాధానికి నిరసనగా జనసేనాధిపతి, పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా చిలకలూరిపేట నియోజకవర్గ బాధ్యుడు తోట రాజా రమేష్ ఆధ్వర్యంలో బొప్పూడి కొండపై కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు శుభ్రం చేశారు.


ఆలయ మెట్లు శుభ్రం చేస్తున్న జనసేన ఇన్‌ఛార్జి తోట రాజా రమేష్ తదితరులు

పాఠశాల సందర్శన

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని శంకరభారతీపురం పాఠశాలలో పాల్ ట్యాబ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బోధన పద్ధతులపై ఆరా తీశారు. విద్యార్థుల నుంచి సమాచారం రాబట్టారు. ప్రధానోపాధ్యాయిని పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

అన్న క్యాంటీన్‌కు విరాళం



నగదు అందజేస్తున్న రాజుపాలెం మండల డీలర్స్ అసోసియేషన్ నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అన్నార్తుల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్‌కు రాజుపాలెం మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1,00,116 ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు అందజేశారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి అన్నదానంలో భాగస్వాములు కావాలని కన్నా కోరారు.

సెపక్‌తక్రా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

సత్తెనపల్లి గ్రామీణ: పెదమక్కెనలో 68వ రాష్ట్రస్థాయి బాల బాలికల అండర్-19 సెపక్‌తక్రా పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళ, బుధవారాల్లో రెండ్రోజులపాటు జరగనున్న పోటీలకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల మైదానం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లాలకు చెందిన 13 చొప్పున బాలుర, బాలికల జట్లు పోటీలకు హాజరు కానున్నాయి. పోటీలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించనున్నారు.

మున్సిపల్ డీఈకి సత్కారం

సత్తెనపల్లి: బదిలీపై గుంటూరు నగర కార్పొరేషన్‌కు వెళ్తున్న మున్సిపల్ డీఈ మధుసూదనరావును పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి, కమిషనర్ షమ్మీ, అన్నివిభాగాల అధికారులు, ఉద్యోగులు సోమవారం కార్యాలయంలో సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? పెదపాలెం, మిట్టపాలెం గ్రామాల్లో పొలాలకు ఎన్నెస్పీ కాలువ నీరు అందక ఇబ్బంది పడుతున్నాం. **- శ్రీనివాసరావు, పెదపాలెం రైతు ప్రతినిధి**

✔ బెల్లంకొండ బ్రాంచి కాలువకు 500 క్యూసెక్కుల వరకు విడుదల చేస్తున్నాం. అవి ఎగువ పొలాలకే సరిపోతున్నాయి. ఈఈ తాడికొండ దృష్టికి తీసుకెళ్లి కాలువ చివరన ఉన్న భూములకు నీరు విడుదలకు చర్యలు తీసుకుంటాం. **- భాస్కర్, ఏఈ**

- న్యూస్‌టుడే, అచ్చంపేట

భవిత కేంద్రం పరిశీలన

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల పిల్లలకు చదువుతో పాటు వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన భవిత కేంద్రాల సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని సహిత విద్య రాష్ట్ర సమన్వయకర్త మల్లికార్జున తెలిపారు. ముప్పాళ్లలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. సహిత విద్య జిల్లా సమన్వయకర్త సెల్వరాజు, ఎంఈవో సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

సత్తెనపల్లి గ్రామీణ: మండల పరిధి లక్కరాజుగార్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.నాగరూప వక్తృత్వ పోటీలో ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం శారదాదేవి తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ - 2047 అంశంపై జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుకుని వృద్ధిలోకి రావాల్సిన వయసులో మత్తు పదార్థాల జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్సై సత్యనారాయణ హితవు పలికారు. సోమవారం మండాదిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్సై పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువులతోపాటు ఆట, పాటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

దసరా వేడుకలకు సర్వం సిద్ధం

మాచర్ల (కారంపూడి): ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే దసరా వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశామని మాచర్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ పాలకమండలి సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు వేడుకలకు సంబంధించిన పుస్తకాలను సభ్యులు ఆవిష్కరించారు. మండలి అధ్యక్షుడు భవనాశి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఆలయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా భక్తులతో కుంకుమ పూజలు చేస్తామన్నారు.

వార్డెన్‌పై ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నరసరావుపేట అర్బన్: మాచర్ల మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికపై అత్యాచారం చేసిన వార్డెన్‌పై ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బీసీ కులానికి చెందిన శ్రీనివాసరావు ఎస్టీగా ధ్రువపత్రం పొంది ఉద్యోగం చేస్తున్నాడని పేర్కొన్నారు.

ఇల్లు కట్టుకో.. గౌరవం పెంచుకో..!

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

నిరుపేదల సొంతింటి కల సాకారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వివిధ దశల్లో ఆగిపోయిన ఇంటి నిర్మాణ పనుల్ని మళ్లీ పట్టాలెక్కించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయించేందుకు చైతన్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మన ఇల్లు.. మన గౌరవం పేరుతో గృహనిర్మాణశాఖ అధికారులు నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో మంజూరైన ఇళ్ల నిర్మాణాల పూర్తికి లక్ష్యాన్ని పెట్టుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

పీఎంఏవైలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి వ్యయమంతా కేంద్రమే భరిస్తుంది. వైకాపా ప్రభుత్వం ఆ ఇళ్లకు జగనన్న కాలనీ బోర్డులు తగిలించి తామే పక్కా ఇళ్లు మంజూరు చేసినట్లు గొప్పలకు పోయింది. ఏ కాలనీలోనూ 30 శాతం మేరకు కూడా పనులు పూర్తి చేయించలేకపోయింది. ప్రభుత్వం మారిన వెంటనే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఆగిపోతాయని వైకాపా నాయకులు ప్రచారం చేశారు. దీనికి భిన్నంగా అక్కడి ఇళ్ల నిర్మాణాల పూర్తిపైనే కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గతంలో మంజూరైన ఇళ్లు పూర్తి చేయకుంటే, వచ్చే ఏడాది కొత్తగా మంజూరు చేసేందుకు ఇబ్బందులు ఉంటాయి. ఈ నేపథ్యంలో పనుల పూర్తికి అధికారులకు బాధ్యతలు అప్పగించింది.

లబ్ధిదారులకు అవగాహన

ఏ మండలంలో ఎన్ని ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయనే సమగ్ర సమాచారాన్ని ముందుగా సేకరించి అధికారులకు ఇచ్చారు. సచివాలయానికి ఓ నోడల్ అధికారితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు ఆగిపోవడానికి కారణాలు తెలుసుకుంటున్నారు. ఇంటిని పూర్తి చేయకుంటే లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. భవిష్యత్తులో వారికి బిల్లులు అందని పరిస్థితి ఉంటుంది. ఇదే విషయాన్ని 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంలో చెబుతున్నారు.



అవగాహన కార్యక్రమంలో లబ్ధిదారులు, అధికారులు

నియోజక వర్గం	లింటెల్ స్థాయి	శ్లాబు పూర్తి	మొత్తం
గురజాల	260	432	692
మాచర్ల	181	284	465
పెదకూరపాడు	365	586	951
సత్తెనపల్లి	560	1036	1596

లక్ష్యమిలా.. : ❖ పునాది దశ నుంచి లింటెల్ స్థాయిలోని ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలి.
❖ శ్లాబు వేసిన ఇళ్లను ఈ ఏడాది డిసెంబరులో పూర్తి చేయాలి.

రాష్ట్ర, జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాల, బాలికల జట్లతో ప్రిన్సిపల్, పీడీలు, పీఈటీలు

అచ్చంపేట, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల, బాలికల కుస్తీ జట్ల ఎంపిక పోటీలు సోమవారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. అండర్-14 బాలికల విభాగంలో ఎ.అనూష, అలేఖ్య, పూజిత, మేఘవేణి, నందిని (వి.పి.సౌత్), శారద, రోజా, శ్రీజ (బాపట్ల), ప్రవళిక (అమరావతి) ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో నాగసాయి తన్య, గౌరీప్రతాప్, ప్రణీత్, మదన్, సుదీప్ (అచ్చంపేట), జాయ్‌హామ్యూల్ ప్రిన్స్, పవన్‌కుమార్, అంకితరాజు, సూర్యకృష్ణ (అమీతాభక్షపురం) అండర్-17 బాలికల విభాగంలో కావ్య, మాధురి, అనూష, సంధ్య, పూజామహేశ్వరి, లావణ్య, రోష్నిని, రోజా, అమూల్య, ప్రిన్సి, అండర్-17 బాలుర విభాగంలో బాబు, గోపయ్య, పృథ్వీ, సంతోష్, చక్రధర్, జాన్సన్, సుందర్‌పాల్, దనుష్, వెంకటేష్, డేవిడ్, వంశీ, అశోక్‌కుమార్, వరప్రసాద్, కుమార్‌బాబు, రామ్, రాజు, చరణ్‌తేజ, పవన్‌కుమార్, మహేష్ ఎంపికైనట్లు ఫెడరేషన్ కార్యదర్శి, పీడీ భూషణం తెలిపారు.

వాలీబాల్ ఆటలో సత్తా

వెల్దుర్తి, న్యూస్‌టుడే: నియోజకవర్గస్థాయి వాలీబాల్ ఆటల పోటీల్లో మండాది జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచూపి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగరాజకుమారి తెలిపారు. 14 ఏళ్ల విభాగం వాలీబాల్ ఆటలో యువరాజ్, గౌతం, ప్రణీత్, శైలజ ఎంపికయ్యారని, 17 ఏళ్ల విభాగంలో వీరాంజనేయులు, షబానా, ప్రశాంతి, వైష్ణవి, దుర్గాభవాని, లక్ష్మీప్రసన్న జిల్లా పోటీలకు ఎంపికయ్యారు.

కబడ్డీలో ప్రతిభ..

రెంటచింతల: నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో సెయింట్ జోసెఫ్ విద్యార్థులు సత్తా చాటారని కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య, హెచ్ఎం ఫాదర్ సురేష్ తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో సుస్మిత, అఖిల, అండర్-17 బాలికల విభాగంలో డి.జయంతి, హారిక, అండర్-17 బాలుర విభాగంలో శివప్రసాద్, లక్ష్మయ్య జిల్లా జట్లకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నార్నెపాడు విద్యార్థులు..

ముప్పాళ్ల: నార్నెపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్-14 ఖోఖో, అథ్లెటిక్స్, చెస్‌లో విద్యార్థులు సతీష్, నీలవేణి, గోపీచరణ్, శ్రీనివాస్, జస్వంత్‌రెడ్డి, దివ్యభారతి, విజయలక్ష్మి, శ్రావణి, చిన్నారి, జయశ్రీ, గోపీచంద్, అజయ్‌కుమార్, శ్రీనాథ్, యోహాన్, దుర్గాభవాని జిల్లా పోటీలకు ఎంపికయ్యారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: మనం తినే ఆహారంపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక తితిదే కల్యాణ మండపంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రీయ పోషణ మహా పౌష్టికాహార మాసోత్సవ చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లీబిడ్డల ఎదుగుదలతోపాటు వారి సంపూర్ణ ఆరోగ్యానికి అవసరమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం, గర్భిణుల సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. సీడీపీవో శ్రీలత, కూటమి నాయకులు రామస్వామి, వందనాదేవి, నాగేశ్వరరావు, పెదకరిముల్లా, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని బంగ్లా సెంటరు నుంచి అంబేడ్కర్ బొమ్మ వరకు ర్యాలీ చేశారు. కార్మికుల వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని నినాదాలు చేశారు.

మాచర్ల (కారంపూడి): కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం హక్కుల దినోత్సవం పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాన్ని కార్మికులు నిర్వహించారు.



పిడుగురాళ్లలో ప్రదర్శన

గులాబి రంగు పురుగు నివారణకు చర్యలు

సత్తెనపల్లి గ్రామీణ: పత్తి పంటలో గులాబి రంగు, కాయ తొలుచు పురుగు నివారణకు వ్యవసాయ శాఖ అనేక రకాల చర్యలు చేపడుతోందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ, గుడిపూడి, పెదమక్కెన, భీమవరం గ్రామాల పరిధిలో పత్తి పైర్లను ఆయన సోమవారం పరిశీలించారు. గులాబి పురుగు నియంత్రణకు ఒక్కో గ్రామంలో సామూహికంగా పది ఎకరాల పత్తి పంటలో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అధిక ఎరువుల వినియోగంతో నష్టాలు

ఇనిమెట్ల(రాజుపాలెం): పంటలకు కృత్రిమ ఎరువులను ఎక్కువగా వినియోగించటం వల్ల పెట్టుబడి పెరిగి సాగులో నష్టం వాటిల్లే అవకాశం ఉందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ శివకుమారి పేర్కొన్నారు. ఇనిమెట్లలో రైతు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

నకరికల్లు: రూపెనగుంట్ల రైతుసేవ కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, డీఆర్సీ ప్రవీణ్ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేస్తున్న వరి పంటలో యాజమాన్య పద్ధతులను వివరించారు. అవసరం మేరకే పురుగుల మందులు వాడాలని సూచించారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



తులసి

క్రోసూరు (అచ్చంపేట): మత్తు పదార్థాలు, నాటుసారా, అక్రమ మద్యం, గంజాయిని అరికట్టేందుకు అంకితభావంతో పనిచేస్తానని క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ సీఐ టి.తులసి పేర్కొన్నారు. సోమవారం ఆమె క్రోసూరులో సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

మున్సిపల్ డీఈగా శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మున్సిపల్ డీఈగా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే సత్యనారాయణ కొంతకాలం కిందట పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఏఈ రాఘవేంద్ర ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.

తెదేపాలో సర్పంచి చేరిక

నకరికల్లు: కుంకలగుంట గ్రామానికి చెందిన సర్పంచి సుంకర ముత్తయ్య వైకాపాను వీడారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో తెదేపాలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాగి శ్రీను, రుసుం కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కల గోల ఏంటి?



సమావేశానికి హాజరైన సభ్యులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో కుక్కల గోల ఏంటి..? కొన్ని వార్డుల్లో పడుతున్నారు.. మరికొన్ని చోట్ల పట్టట్లేదు. నిధుల ఖర్చుపై కూడా రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయంటూ వైస్‌ఛైర్మన్ కోటేశ్వరరావునాయక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పలు వీధులకు మున్సిపల్ రికార్డుల్లో ఉన్న పేర్లు పెట్టాలని, కొత్తగా బోర్డులు పెట్టి ప్రజల్ని అయోమయానికి గురి చేయవద్దని కౌన్సిలర్ శివప్రసాద్ అధికారుల్ని కోరారు. సర్వే నంబర్లు 102, 103, 104లో వేసిన అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని, శ్రీనివాస థియేటర్ వద్ద అనుమతుల్లేకుండా చేపడుతున్న అండర్‌గ్రౌండ్ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సతీష్ కోరారు. ఛైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు విలువేదీ?

దాచేపల్లి: నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం వాగ్వాదాల నడుమ రసాభాసగా జరిగింది. దాచేపల్లి సచివాలయం-1లో ఛైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ మాట్లాడుతూ తన వార్డులో సమస్యపై చెప్పినా కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయడం లేదన్నారు. ఛైర్‌పర్సన్, బయటి వ్యక్తుల ఇష్టానుసారం అనధికార తీర్మానాలు చేస్తున్నారని పేర్కొంటూ సమావేశ మందిరంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ల మాటకు విలువ లేనప్పుడు సమావేశాలు ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. పలు వార్డుల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులు తదితర సమస్యలపై పలువురు కౌన్సిలర్లు చర్చించారు. కమిషనర్ అప్పారావు, వైస్ ఛైర్మన్లు మస్తాన్‌బి, అన్నపూర్ణ పాల్గొన్నారు.



నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ షరీఫ్



మాట్లాడుతున్న ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

సమస్యలపై ఏకరవు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: అద్దె భవనాల్లో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు పనులు వెంటనే పూర్తి చేయించి భవనం అందుబాటులోకి తేవాలని మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు చెప్పారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో గదులు లేక, చిన్నారుల సంఖ్య 40కి తగ్గిందన్నారు. 26వ వార్డు కౌన్సిలరు పద్మావతి మాట్లాడుతూ కళ్లటౌన్‌షిప్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని కోరారు. 8వ వార్డు కౌన్సిలరు జి.అప్పిరెడ్డి మాట్లాడుతూ వార్డులో మూడేళ్ల నుంచి తట్ట మట్టి పోయలేదు, రహదారులను బాగు చేయించాలన్నారు.. 9వ వార్డు కౌన్సిలరు ఎం.కిరణ్ మాట్లాడుతూ కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. పలువురు తమ పరిధిలోని సమస్యలను సమావేశంలో చర్చించారు.

పనులు చేయకుండా నిధులు స్వాహా



మాట్లాడుతున్న ఛైర్మన్ నరసింహారావు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మున్సిపాలిటీ తీర్మానాలు, అనుమతులు లేకుండానే, రూ.కోట్ల పనులు చేసినట్లు చూపి గత ప్రభుత్వ హయాంలో నిధులు స్వాహా చేశారని, వాటిని నిరూపించేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తీర్మానించారు. సోమవారం ఛైర్మన్ పోలూరి నరసింహారావు అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ మేరకు కౌన్సిలర్ సుభాని మాట్లాడుతూ పనులు చేసినట్లు ఎజెండాలో చూడటం తప్ప, అవి ఎక్కడ జరిగాయో తెలియదన్నారు. కార్యాలయ పరిధిలో ఒప్పంద కార్మికులు ఎంతమంది ఉన్నారు, వారిలో విధులు నిర్వహించేవారెవరో నిగ్గుతేల్చాలన్నారు. కౌన్సిలర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ర్యాటిఫికేషన్లతోనే పాలన సాగిందన్నారు. మరో కౌన్సిలర్ అరుణకుమారి మాట్లాడుతూ పట్టణ హెల్త్ సెంటర్లలో వైద్యులు లేరన్నారు. కౌన్సిలర్ మదార్‌సాహెబ్ మాట్లాడుతూ పట్టణంలో రహదారి మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కమిషనర్ నాగేశ్వరరావు, డీఈ మధుసూదనరావు, ఏఈ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సాహసం..

ప్రాణాలతో చెలగాటం



అసలే జాతీయ రహదారి.. అందులోనూ కిక్కిరిసి ఆటో ప్రయాణం.. ప్రమాదకరమని తెలిసినా చోదకులు అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలిస్తున్నారు. సోమవారం దాచేపల్లి మండలం ఇరికేపల్లిలోని మండల పరిషత్ పాఠశాలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులను ఇలా ఆటోలో తరలించారు. ఆటోలో కూర్చొనేందుకు ఖాళీ లేక వేలాడుతూ సాహస ప్రయాణం చేశారు. అధికంగా ప్రయాణికులను తరలిస్తూ పలు సందర్భాల్లో ఆటోలు అదుపుతప్పిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, దాచేపల్లి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం



మిర్చి, పత్తి వ్యాపారిపై డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న రైతులు

గ్రంధశిరి(అచ్చంపేట) న్యూస్‌టుడే: గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డీఎస్పీ కె.హనుమంతరావు హెచ్చరించారు. ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రంధశిరి గ్రామంలో వైకాపా, తెదేపా వర్గీయుల ఘర్షణను పురస్కరించుకుని సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. కక్షలను వదిలేసి గ్రామాభివృద్ధిపై అందరూ దృష్టి పెట్టాలని డీఎస్పీ హితవు పలికారు. గతంతో అక్రమ కేసులను పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. సీఐ వెంకటప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన పల్లెనిద్ర చేశారు.

పత్తి, మిర్చి రైతుల మొర: గుంటూరుకు చెందిన వ్యాపారి గత సీజనులో గ్రామంలో పత్తి, మిరపకాయలను కొనుగోలు చేసి రూ.3 కోట్లకు కుచ్చుటోపీ పెట్టారని గ్రామస్థులు డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. 30 మంది రైతులకు నష్టం వాటిల్లిందని, న్యాయం చేయాలని కోరారు.

2న గ్రామసభలు

అచ్చంపేట, న్యూస్‌టుడే: అక్టోబరు 2న అన్ని గ్రామ పంచాయతీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనుల గుర్తింపు సభలు నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో వీరరాజు కోరారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు.

ముప్పాళ్ల: అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో విలియమ్స్ చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

దుర్గి, న్యూస్‌టుడే: మండలంలో నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని మండల తెదేపా నేత ఏచూరి సాయిశంకర్ అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మల్లాదిలో తెదేపా ఫ్లెక్సీ చించివేత



చిరిగిన ఫ్లెక్సీ

మల్లాది(అమరావతి), న్యూస్‌టుడే: కూటమి భారీ విజయం సాధించి అధికారంలోకి రావడాన్ని జీర్ణించుకోలేని వైకాపా శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. వివాదాలకు కేంద్ర బిందువుగా మల్లాది గ్రామం మారింది. గ్రామంలో అధికార, ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధం కొనసాగుతూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. పది రోజుల క్రితం ఎమ్మెల్యే ప్రవీణ్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేయడం కలకలం రేపగా.. తాజాగా సోమవారం తెల్లవారుజామున మరోమారు ఎమ్మెల్యే ఫొటోలతో స్థానిక నాయకుల వేయించిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. దీనిపై తెదేపా కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

విజయపురిసౌత్: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మాచర్ల మండలం తాళ్లపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. తాళ్లపల్లిలో నివాసం ఉంటున్న ఓర్సు శివయ్య (32) స్థానిక పవర్ గ్రిడ్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం అతడు గుండెపోటుతో మృతి చెందినట్లు భార్య గాయత్రి తెలుపగా, శివయ్య తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. దీంతో విజయపురిసౌత్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై షేక్ మహమ్మద్ షఫీ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.